
# పిండం

ఇంకా పూర్తిగా చీకటి కాలేదు. వెలుతురు, చీకటి పెనవేసుకున్నట్టుంది. బెజగం నాగమల్లయ్య ఇంట్లో చీకటిగా వుంది.

నాగమల్లయ్య భార్య పార్వతి ఎదిరింట్లో కిరసనాయిల్ దీపం వెలిగించింది. ఆ దీపపు కాంతి అప్పుడే పుట్టిన శిశువు వొంటి రంగులా వుంది. ఆ కాంతి ఎదిరింట్లో క్రమంగా పరచుకుంటోంది.



పార్వతి భుజాల నిండుగా కొంగు వేసుకుని, కళ్ళు మూసుకుని, రెండు చేతులు జోడించి ఏకాగ్రతతో దీపానికి మొక్కుతోంది. ఆమె పెదాలు విడివడి తిరిగి మూసుకుంటున్నాయి. చేతికున్న గాజులు కిందికి జారిపడినాయి. ధ్యానంలో మునిగిపోయినట్టు మునిగిపోయింది ఆమె.

ఆమె ముఖం వెలుగునీడల్లో కనిపిస్తోంది. దీపపు కాంతికి మరో దీపపు కాంతి జోడిస్తే వొచ్చే మెరుపుదనం ఆమె ముఖంలో కనిపిస్తోంది. వత్తయిన కనుబొమలు ఆకాశంలో పుంగిరి పూసిన ఆకారంలో వున్నాయి. కళ్ళు పాల మీగడలా వున్నాయి. ముక్కుమీద, పై పెదవిమీద చెమట తడి మెరుస్తోంది. ముక్కుకున్న తెల్లరాళ్ళ ముక్కుపుల్ల తళుక్కుమంటోంది. కొంత లావుగా వున్న పెదవులు జారిపడుతున్నట్టుగా వున్నాయి. గదవ దగ్గర చిన్న గుంట సొట్టపడినట్టుగా వుంది. సాగదీసి అతికించినట్టున్న నుదురుపై కుంకుమ బొట్టు సగం సూర్యుడు, సగం చంద్రుడిలా కనిపిస్తోంది. గట్టిగా దూసిన నల్లటి జుట్టు తలముడిలో ఇమిడిపోయింది. మెడ దగ్గర పుట్టుమచ్చ ప్రత్యేకంగా కనిపిస్తోంది. మెడలో నల్లపూసలతో పాటు వున్న పసుపుతాడు తొంగిచూస్తున్నట్టుగా వుంది.

ఆమె కట్టుకున్న ఎర్రచీరకు వంకాయ రంగు అంచు అరవేయుంతగా వుంది. చింతపూల రవిక బిగుతుగా వుంది. పార్వతి వయసు ఇరవై లోపే.


పార్వతి దీపానికి మొక్కడం పూర్తయింది. చేతులు కిందికి దించింది. గాజులు చప్పుడు చేస్తూ యథాస్థానాని కొచ్చాయి. పొత్తికడుపు కాస్త ఎత్తుగా కనిపిస్తోంది. ఇప్పుడామెకు అయిదో నెల దాటింది. కడుపుమీద పల్ల వెంట్రుకలు గీతలా కనిపిస్తున్నాయి.

గోడకు తగిలేసి వున్న అద్దంలో పార్వతి తన ముఖాన్ని చూసుకుంది. మసగ్గా వున్న ఆ అద్దంలో తన ముఖం ముద్దగా కనిపించింది. ఆ అద్దాన్ని కిందికి వంచి చూసుకుంది, పొత్తికడుపు ఎత్తుగా కనిపిస్తోంది. అనుకోకుండానే కుడిచేయి పొత్తికడుపు మీదకు వెళ్ళింది. అద్దాన్ని యథాస్థానంలో పెట్టి పొత్తికడుపు నిమురుకుంటూ ఆమె అక్కడనుంచి కదిలింది.

పార్వతికి ఇది మొదటి గర్భం. అంతా వింతగా, కొత్తగా వుంది. మాటల్లో చెప్పరాని గర్వం ఏదో తనకు తెలియకుండానే తనలో ప్రవేశించిందనిపిస్తోంది. అలాగే తన శరీరంలో అంతకుముందు లేని కొత్త అందాలు రూపుదిద్దుకుంటున్నాయనిపిస్తోంది. పొత్తికడుపులో పిండం కదులాడే తీరు; ఆ తీయటి అనుభూతి, వింత ఆనందం... అంతేకాకుండా పొరపాటున తన చేయి తన రొమ్ములకు తాకినా గురిచూసి కొట్టినట్టు నొప్పి; బాధ.. తన పిరుదులు పొంగినట్టు తనకే స్పష్టంగా తెలుస్తోంది. నడుమువద్ద చర్మం సాగదీసినట్టు తనకే వింతగా అందాలను కుమ్మరిస్తోంది. అయినప్పటికీ శరీరంలో నీరసంగా వుంటోంది.


నిన్న మొన్నటి వరకు ఏమీ తెలియని తాను సృష్టి

— వుప్పల నరసింహం



రహస్యాన్ని తెలుసుకునే దిశకు ప్రయాణమవుతున్నట్టుగా వుంది. తన గర్భంలో మరో జీవి కదులాడుతూ వుంటే అనేకానేక అగమ్యగోచరమైన విషయాలు, అస్పష్టమైన విషయాలు, ఎప్పుడూ ఊహకురాని విషయాలు వాటంతట అవే తెరలను తొలగించుకుని, ఎంతో వెలుగుతో కళ్ళముందు నర్తిస్తున్నట్టుగా వుంది. తనకు తెలియకుండానే తనలో ఎన్నో కవాటాలు తెరచుకుంటున్నాయి. ఆ కవాటాల గుండా అనుక్షణం ఊపిరాడనివ్వని కొత్త కొత్త విషయాలు ప్రవహిస్తున్నాయి. అన్నీ అంతకుముందు అనుభవంలోకి వచ్చినవే అనిపిస్తుంది. నిజానికి ఏవీ అనుభవంలోకి రాలేదు. మరెందుకలా అనిపిస్తోంది? ఎందుకలా అన్నీ తెలిసినట్టే తోస్తున్నది? అన్నిట్లో తల పండినవారికి వెన్నుపూసలోని ప్రతి కండరం కదలిక తెలిసినట్టు తనకూ అలాగే తెలుస్తోంది. కాని నిన్న మొన్నటి వరకు తనకేమి తెలుసు? ఏమీ తెలియదు! నూటికి నూరుపాళ్ళా ఏమీ తెలియదు. తెలుసుకోవాలన్న ధ్యాస కూడా వుండేది కాదు. కాలువలో నీరు ప్రవహిస్తున్నట్టు ప్రవహించడమే తెలుసు. మరెందుకు ఈ మధ్యన ప్రతి విషయం లోతుపాతులు ఇట్టే అర్థమవుతున్నాయి? ఏది అర్థాంతరంగా ముగుస్తుందో, ఏది సంపూర్ణంగా అవతరిస్తుందో ముందే తెలిసిపోతుంది. దీనికంతటికీ కారణం ఏమై వుంటుంది? తనకు కొత్తగా ఏదైనా ఆరో జ్ఞానేంద్రియం అబ్బిందా? అబ్బితే అబ్బిందేమో? అదే ఈ సృష్టికి, ప్రకృతికి ప్రాణప్రదమైన, అపురూపమైన గర్భం దాల్చడమేమో!

నిజానికి గర్భం దాల్చడమంటే ఎన్నో రహస్యాలను ఛేదించి అసలు విషయాన్ని ఔపోసన పట్టడమేమో? అదే తనలో జరుగుతున్నదనిపిస్తోంది పార్వతికి. తన రూపంలో, ఆకారంలోనే కాదు అలవాట్లలో, కదలికల్లో, కనుకొలుకుల్లో, మాటల్లో, చేతల్లో అంతకు ముందెరుగని నిండుదనం; హెచ్చు, తగ్గుస్థాయి ఆవేశాలకు




దూరంగా నిండుగా నిండిన కుండలా తనకు తానే అలా తోస్తున్నది.

పార్వతి ఎదిరింట్లో నుంచి అరుగుమీద వున్న పొయ్యింట్లోకి నడిచి పొయ్యి రాజేసింది. పిడక మీద కిరస నాయిలు పోసి రాజేసిన మంట భగ్గున అరగజం పైకి లేచింది. ఆ వెలుగులో ఒక్కసారి మసిబారిన గోడలు నల్లగా మెరిసినయ్. గోడకు తగిలేసిన కుండల ఆమాకీ తెలిసింది. ...మంట నాలికలు తలలోకి లాక్కున్నట్టుగా మెల్లిగా పొయ్యిలోకి వెళ్ళిపోయాయి. అప్పుడు అన్నం కోసం ఎసరుపెట్టింది పార్వతి.

పొయ్యి నిండా పిడకలు పెడుతూ, మంట నిండుగా వచ్చేట్టు చూస్తున్న పార్వతికి అరుగు మీదకు ఎవరో వచ్చిన అలికిడి అయి అటుదిక్కు చూసింది. పక్కింటి పోశమ్మ బిడ్డ నాలుగేళ్ల నాగమణి నిల్చుంది. చేతిలో బోకె వుంది. చేతులకు రబ్బరు గాజులు, కొత్తగా కుట్టిన ముక్కుకు పుందు, జెడకు పాతపడిన రిబ్బన్లు, పూల పూల గౌను వేసుకుని ఓ చేత్తో తల గోక్కుంటూ నిల్చుంది.

నాగమణి అలా నిల్చోవడం ఎంతో ముద్దుగా వుంది. పార్వతికి మరెంతో ముద్దొచ్చి-

''ఏం గావాలెనే నాగమణి? యిక్కడ  రా!...'' అని చేయితో, తలతో సైగ చేసింది పార్వతి.

అడుగులో అడుగేస్తూ మెల్లిగా పార్వతి దగ్గరికి నడిచింది నాగమణి.

దగ్గరికి రాగానే లాక్కొని తన ఒడిలో కూర్చోపెట్టుకుంది పార్వతి. చేతిలో వున్న బోకె పక్కన పెట్టింది. యింకా కాస్త దగ్గరగా హత్తుకుని, ముద్దుపెట్టి గారాబంతో...

''ఏం కావాల్నే....'' అని అడిగింది.

నాగమణి ఓ సారి తల పైకెత్తి పార్వతి కళ్లలోకి ఓసారి చూసి, తిరిగి తల కిందికేసుకుని, నోరు పెద్దగా తెరచి

''ఆ...మా అమ్మా...జెరంత యింగలం పెట్టుమన్నది'' అంది.

''పొయ్యి ఇప్పుడు రాజేసిన గదనే. జెర సేపు కూసో ఇంగలం కాంగనే పెడ్త'' అంటూ నాగమణిని సరిగ్గా కూర్చోబెడుతూ జడలు విప్పింది పార్వతి. గోళ్ళతోనే వెంట్రుకలను నుదురు నుంచి వెనక్కు తీసి విడిపడివున్న వాటిని ఓ దగ్గరికి చేర్చి జడ అల్లసాగింది. నాగమణి బుద్ధిగా కూర్చుంది. పార్వతి కళ్ళల్లో మెరుపు...ఏదో తన బిడ్డకే జడ వేస్తున్న తృప్తి మనసు పొరల్లో తేలుతూ వుంది...మనిషికి ఈ ప్రేమ భావన, మమకారం లేకపోతే ఈ ప్రపంచం మరో తీరుగా వుండేదేమో? నాగమణికి రెండు జడలు అల్లి, రిబ్బన్లు కట్టింది. తన వైపుకు తిప్పుకుని కొంగుతో ముఖంపైన చమటను, నూనె చమురును తుడిచింది. తుడిచి మరోసారి గట్టిగా ముద్దు పెట్టుకుని...

''ఏదీ జెర జరుగు. పొయ్యిలో పిడకలు సల్లారినట్టున్నయ్...'' అంటూ నాగమణిని కాస్త దూరం జరిపి 'చిమ్టె'తో పొయ్యిలో కెగిరిచ్చి,ఎర్రగా కాలివున్న పిడకను చిమ్టెతో తీసి నాగమణి తెచ్చిన బోకెలో వేసింది. మరో రెండు ఇంగలాలు ఏసి

''ఇగో తీస్కపోవే...'' అంటూ బొకెను కింది నుంచి తీసి నాగమణి చేతికిస్తూ-

''పయిలంగా తీస్కపో. చేయి కాల్చుకునేవ్...'' అంది.



నాగమణి తల ఊపి, అక్కడినుంచి మెల్లిగా అడుగులో అడుగేస్తూ నడిచింది.

పార్వతి పొయ్యిలో మరో నాలుగు పిడకలు పెట్టి గొట్టంతో ఊది మంట చేసింది.

నాగమణి యింకా తన ఒడిలో కూర్చున్నట్టుగానే వుంది. ఏవేవో ఆలోచనల్లోకి వెళ్ళిపోయింది పార్వతి.

పార్వతి అత్త అంతమ్మ వరి కోతల నుంచి అప్పుడే యింటి కొచ్చింది. కొంగు నడుముకు బిగుతుగా చుట్టుకుని, వీపులో కొడవలి దోపుకుని, దారిలో కనిపించిన తోటకూర వొడిలో పెట్టుకుని, కాళ్ళు, చేతులు, నడుము నరాలు దూది ఏకుతున్నట్టుగా లాగుతూ వుంటే మొఖం పిడచకట్టుకపోయింది. పెదవులు పూర్తిగా తడారిపోయాయి. గొంతు పిల్లనగ్రోవి కర్ర ముక్కలా మారింది. మాట్లాడడం కూడా చేతకాక పోయేసరికి మెల్లిగా గుమస్తూ, వచ్చీ రాగానే ఎదిరింటి గడపపై తలపెట్టి మేను వాల్చింది.

పూర్తిగా అలసిపోయి, పలుకు లేకుండా తన అత్త ఇలా పడుకోవడం కొత్తేమీ కాదు. అందుకనే పార్వతి కంగారుపడలేదు. కాని ఆమె స్థితి చూస్తే ఓ క్షణం గుండె మూల్గింది. అంతకుమించి తానేమీ చేయలేని పరిస్థితి. కాకపోతే పొయ్యిలో మంట ఎక్కువ చేసి, అన్నం త్వరగా వండి తన అత్త కాళ్ళు, చేతులు కడుక్కోవడానికిగాను వేడి నీళ్ళు పెట్టడానికి ప్రయత్నించ సాగింది.

అన్నం ఉడికింది. గంజి వార్చింది. కొద్ది సేపయ్యాక వేడినీళ్ళు సిద్ధమయ్యాయి. పార్వతి వేడినీళ్ళ బుడ్డితో అత్త దగ్గరి కొచ్చి, భుజంపై చేయి వేసి కదుపుతూ "అత్తా..." అని పిలిచింది.

అలసిపోయి వచ్చిన అంతమ్మకు అలాగే కునుకు పట్టింది. ఆ కునుకులోనే ఓ పీడకల... "అత్తా..." అన్న పిలుపుకు ఉలికిపడి లేచింది. కల చెదరిపోయింది. కల మిగిల్చిపోయిన ఛాయలు మొఖం నిండా వున్నాయి.

వాటిని వదిలించుకునేందుకుగాను దీర్ఘంగా ఊపిరి వదిలింది. బద్దలా వంగి నిలబడ్డ కోడలిని చూసింది.

''ఉడుకు నీళ్ళు పెట్టిన, కాళ్ళు చేతులు కడుక్కో...'' అంటూ బుడ్డి అత్త పక్కన పెట్టి ఎదిరింట్లో కెళ్ళింది పార్వతి. ఎదిరింట్లో నుంచి చాట తెచ్చి అత్త వడిలో వున్న తోటకూర తీసి చాటలో వేసింది. వీపులో వున్న కొడవలి తీసి సూరులో చెక్కింది.

అంతమ్మ మోకాళ్ళు పట్టుకుని మెల్లిగా లేచింది. పార్వతి పొయ్యి దగ్గరికి నడిచింది.

''ఆ కూరల పప్పు ఏసి వండే పిల్ల...''అంది అంతమ్మ కోడల్ని ఉద్దేశించి.

''ఆఁ'' అంది పార్వతి.

''ఆ వరిమోపులు మోసి మోసి నా పానం పోయింది తల్లీ! పచ్చికట్టలు, నీళ్ళు ఒడుస్తుండగా మొగోళ్ళకు కూడా లేవలేనంత పెద్ద మోపులు నెత్తిమీద ఎత్తుకుని ఆమడంత దూరం ఆ కొసకున్న కల్లంలకు మోసేసరికి రేపు పోయే పానం ఇయ్యాలనే పోయే టట్టుంది...ఆ

పటేలు యిచ్చే ఐదు శేర్ల వొడ్లకు వొచ్చే పానం, పోయే పానం అయింది..." అని తనలో తానే గొణుగుతూ బుడ్డిచేత పట్టుకుని దడి దగ్గరికి నడిచింది.

పార్వతి తోటకూర ఆకులు తీస్తూవుంది.

వాగలి పగ్గాలను భుజంమీద వేసుకుని, చిన్న మూటగా కట్టిన తువాలును అదే భుజంపై వేసుకుని, బీడీ కాలుస్తూ, నడుమువద్ద చెక్కుకున్న ధోవతి కొసను సర్దుకుంటూ నాగమల్లయ్య ఇంటి అరుగుమీదికొచ్చాడు.

పొయ్యింట్లో నుంచి వస్తోన్న వెలుతురులో కూర్చుంటూ, తన భుజం మీద వున్న మూట కింద పెట్టాడు.

నాగమల్లయ్యకు తల జుట్టు బాగా పెరిగి వుంది. పిల్లి గడ్డం, సైన్ గుడ్డ బనియన్, ధోవతి కట్టుకున్నాడు. అతని ఎడమ చేతి మణికట్టుకు నల్లదారం కట్టివుంది. వేలుకు రాగి వుంగరం దీపపు కాంతిలా ఎర్రగా వుంది.

విప్పుతున్న ఆ మూటను చూసి

"ఏం మూట అది?" అనడిగింది పార్వతి.

"మీ అయ్య బెల్లం పంపిండు..." అన్నాడు నాగమల్లయ్య తనలోతాను నవ్వుకుంటూ.

ఏ విషయమడిగినా తన తల్లిగారి పేరు జోడించి చెప్పి తనను ఏడిపించడం ఆయనకు అలవాటేనని తెలిసిన పార్వతి చిరుకోపంతో...

"ఉఁ" అని చిన్నగా గునిసి, "అయితే నువ్వే తిను..." అంది.

"పొట్టతో నేనుంటె నేనే తిందును. కాని నేను పొట్టతో లేను కదా? నువ్ పొట్టతో వున్నావ్ కదాని నీకే పంపిండు మీ అయ్య..." అన్నాడు నాగమల్లయ్య మరింత ఉడికించేందుకుగాను.

ప్రతిరోజు రెండు మూడు సార్లయినా 'పొట్ట' గురించి కలవరించనిదే ఆయన మనసు మనసులో వుండదని తెలిసినా ఎందుకో ఆ మాట అన్నప్పుడల్లా సిగ్గనిపిస్తుంది పార్వతికి. ఓ క్షణం కాలు చేయి ఆడకుండా అవుతుంది.

రెండు క్షణాల తర్వాత...

"అవి ఏమిటో చెప్పరాదూ?" అంది అధికారం చెలాయిస్తున్నట్టుగా.

నాగమల్లయ్య మూట విప్పాడు. కొద్దికొద్దిగా ప్రాణమున్న చేపలు కనిపించాయి. అనుకోకుండా పార్వతి నోట్లో నీళ్ళు ఊరాయి. తన కోరికేదో ఫలించిన సంతోషం ఆ కళ్ళల్లో తొంగిచూసింది. మనసులో ఓ క్షణం బావిలో తొలుకులు వచ్చినట్టనిపించింది.

కొంగుతో మొఖం తుడుచుకుంటూ అంతమ్మ దడి దగ్గరి నుంచి అరుగుమీదకు వచ్చింది. కొడుకు ముందు వున్న చేపలు చూసి

"ఏడ నుంచి తెచ్చినవ్ బిడ్డా?" అనడిగింది.

"చెరువు వెనక పటేలు పొలం దగ్గర బొందల పట్టినం..." అన్నాడు.

పార్వతి మనసు చేపలకోసం ఆరాటపడుతోంది. ఆ విషయం అప్పుడెప్పుడో భర్తతో అంటే జ్ఞాపకం పెట్టుకుని తెచ్చాడు. తాను నెల తప్పినప్పటి నుంచి తన భర్త, అత్త తన తిండి పట్ల, చేసే పనుల పట్ల తీసుకుంటున్న శ్రద్ధను తలచుకుంటే తాను పుట్టింట్లోనే వున్నట్టుగా వుంది. ఏ అత్త, ఏ భర్త ఇంత అపురూపంగా తమ కోడలిని చూడరేమోననిపిస్తోంది.

ఐదు నెలల క్రితం తాను నెల తప్పానన్న విషయం భర్తతో చెప్పినరోజు గుర్తుకు వచ్చింది పార్వతికి.

ఆరోజు...

పార్వతి కూలికి పోలేదు. వాకిట్లో సాన్పిచల్లింది. ఇల్లు వాకిలి అలికి ముగ్గేసింది. వున్న ఒక్క బిందె తెల్లగా తోమి చేద బావినుంచి నీళ్ళు తెచ్చింది. పారం, పదిహేను రోజుల నుంచి మాసిన బట్టల మూటను తీసుకుని పిండడానికి గాను పంపు బావికి పోయింది. ఆ తరువాత యింటికొచ్చి తల స్నానం చేసింది. పని అంతా పూర్తయ్యేసరికి మధ్యాహ్నం రెండు గంట లయింది. పచ్చిగా వున్న తల వెంట్రుకలను ఎండకు ఆరబెట్టు కుంటూ వుండగా భర్త నాగమల్లయ్య వచ్చాడు భోజనానికి. అత్త అంతమ్మ లేదు. రెండురోజుల క్రితమే బిడ్డను చూడ్డానికి పోయింది. వాకిట్లో కూర్చున్న భార్యను చూడగానే నాగమల్లయ్య కళ్ళు చెదిరినట్టయ్యాయి. పొట్టకొచ్చిన వరిచేనులా కనిపించింది.

నాగమల్లయ్య దడి దగ్గర కాళ్ళు చేతులు కడుక్కుని, భుజంమీది తువ్వాలుతో తుడుచుకుంటూ అరుగు మీదికి నడిచాడు.


తన భర్తకు విషయం ఎలా చెప్పాలా? అని తనలో తానే తర్కించుకుంటున్న పార్వతి ఎలా చెప్పాలో నిర్ణయించుకోలేకపోయింది. అలాగే కూర్చుండిపోయింది.

"గట్ల కూసున్నవూ? బువ్వ పెడుదువ్ రా!" అన్నాడు నాగమల్లయ్య అరుగుమీది నుంచి.

పార్వతి చిన్నగా తనలో తాను నవ్వుకుంటూ తల వెంట్రుకలను ముడివేసుకునేందుకు గాను రెండు చేతులను వెనక్కి ఎత్తింది. అప్పుడు ఆమె రూపం మరింత అందంగా కనిపించింది నాగమల్లయ్యకు.

పొయ్యింట్లోకి గాక పార్వతి ఎదిరింట్లోకి నడిచింది.

## కవితల కొరకు



కోయిలా నువ్వలా తియ్యగా పాడితే
నా యెడద పులకించి నాట్యమాడేనే
ఎలమావి చివురు తిని గళమెత్తి పాడేవు
నీ పాటతో జగము పులకింప జేసేవు
కలతలను మరపించి మురిపించు నీ పాట
కన్నీటి బ్రతుకులో
పన్నీరు చిలికెనే
తీగలన్నీ సడలి
మూగవడిపోయిన బ్రతుకు వీణను
మరల శృతి చేసె నీ పాట
రాగమెరుగని నాలో అనురాగమొలికి
ఎద నిండ
మధురిమలు నింపినది నీ పాట

—సత్యవాడ సోదరీమణులు

కాలమ్‌ దాటని కథ

# లోకం తీరు

''నమస్కారం వెంకటసుబ్బయ్య గారూ! చాన్నాళ్ళకి కనిపించారు'' బజార్లో ఎదురుపడ్డ వెంకట సుబ్బయ్యను పరామర్శించాడు పరంధామయ్య.

''నమస్తే... నమస్తే...! ఎలా సాగుతోంది మీ వ్యాపారం?'' ప్రశ్నించాడు వెంకటసుబ్బయ్య.

''ఏదో మీ దయవలన బాగానే జరుగుతోంది'' సమాధానమిచ్చాడు. ఇద్దరూ బజారు పని చూసుకొని తిరుగుముఖం పట్టారు.

దార్లో పరంధామయ్య చెప్పాడు-

''మీరేమీ అనుకోనంటే చాలా రోజులుగా ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను.''

''మరేం ఫర్వాలేదు! చెప్పండి?!'' ప్రశ్నార్థకంగా అడిగాడు వెంకటసుబ్బయ్య.

''మీ అమ్మాయి రోజూ స్కూటర్‌లో ఓ అబ్బాయితో తిరుగుతోంది. వయసొచ్చిన ఆడపిల్ల కదాని మీ చెవిన వేస్తున్నాను! ఋజువు కావాలంటే, ఈ సమయంలో వాళ్ళెక్కడుంటారో నాకు తెలుసు, నాతో



రండి చూపిస్తాను'' అంటూ ఓ రెస్టారెంటుకు తీసి కెళ్ళాడు.

అక్కడ ఆ అమ్మాయి ఇంకో అబ్బాయితో కలిసి నవ్వుకుంటూ టిఫిన్ చేస్తోంది. అది చూసిన వెంకట సుబ్బయ్య కళ్ళు ఎర్రబడ్డాయి.

పరంధామయ్య వద్ద సెలవు తీసుకొని ఇంటిముఖం పట్టాడు. అప్పటికే ఇంటికొచ్చి ఏదో పని చేసుకొంటోంది వాసంతి!

''అమ్మాయ్, వాసంతీ!'' గట్టిగా పిల్చాడు వెంకట సుబ్బయ్య. కంగారుగా హాల్లో కొచ్చిపడింది వాసంతి!

''ఇక మీదట నువ్వు అన్నయ్యతో బాటు స్కూటర్ మీద బయటికెళ్ళడానికి వీల్లేదు! ఎక్కడికైనా వెళ్ళాలను కుంటే సిటీబస్సులో వెళ్ళంతే!''

తండ్రి ఎందుకలా అంటున్నాడో అర్థంకాని వాసంతి తెల్లబోయింది.

—ఎ.జి.మణి

తలుపు చాటుకు నిలుచుంది. నాగమల్లయ్య ఎదురింట్లో కెళ్ళి అటూ, ఇటూ చూసి తలుపుచాటున వున్న భార్య దగ్గరికి నడిచి దగ్గరికి లాక్కోబోయాడు. పార్వతి తప్పించుకుని గోడకు అత్తుకుపోయింది.

''ఏమి గట్లున్నవ్? మీ తల్లిగారింటి నుంచి ఎవరైన వచ్చిండ్రా?'' అని అడిగాడు.

పార్వతి సిగ్గుపడుతూ తల అడ్డంగా ఊపింది.

''మరేంది కథ?''

కొద్దిసేపు మౌనంగా వుండి పార్వతి గుసగుసగా నాగమల్లయ్యతో చెప్పింది. దాంతో భర్తనాగమల్లయ్య అమాంతం పార్వతిని ఎత్తి గిరగిరా తిప్పి నిలబెట్టాడు.

...............

''పొయ్యి మీద ఏముందే పిల్లా?...'' అని అంతమ్మ అడిగేసరికి పార్వతి ఆలోచనలోంచి తేరుకుంది.

''ఏం లేదు'' అని క్షణం తరువాత జవాబిచ్చింది. తిరిగి ఆలోచనల్లో పడింది. తన అత్త ఊరి నుంచి రాగానే విషయం చెవిన వేయగానే ఎంత సంతోషపడింది? దండోరా వేయించినట్టు వాడవాడ తిరిగి చెప్పింది. చెప్పినవాళ్ళకే తిరిగి చెపుతూ ఎన్ని రోజులు గడిపింది? పని గట్టుకుని బంధువుల ఇళ్ళకెళ్ళి తాను నాయనమ్మను కాబోతున్నానని ఎంత మురిసిపోయింది ఆ రోజుల్లో... ఇరవై రెండేళ్ళ తరువాత తన ఇంట్లో ఓ కొత్త జీవి పుట్టబోతున్నదని చేదబావి వద్ద, కలుపు చేన్లో చెప్పుకుని మరీ మురిసిపోయింది... అవును మరి ఎన్నో సంవత్సరాల తరువాత ఈ ఇంట్లో పురుటివాసన వేయబోతూ వుంటే, చిన్న పిల్లవాడి కేరింతలు వినబోతూ వుంటే ఎవరికైనా సంతోషం, ఆనందం, గర్వం వుంటుంది కదా? అనుకుంది పార్వతి!

ఒక్కసారి దీర్ఘంగా ఊపిరి వదిలి పార్వతి పొయ్యి దగ్గర్నుంచి లేచి భర్త దగ్గరకొచ్చింది. చేపలను తాకి చూసింది. ఒకటే, రెండు కదిలీ కదలనట్టు కదిలాయి. పట్టుకుంటే జారుతున్నాయి.

ఆలస్యమయినప్పటికీ చేపల కూర వండింది పార్వతి. చేపలకూర వాసన ఆ వాడంతా వ్యాపించింది. రెండిళ్ళ ఆవల వుండే రంగమ్మ వొచ్చి ''మీ ఇంట్లో చేపలకూర వండినారే?...'' అని అడిగి కొంత తీసుకెళ్ళింది.

పార్వతి ముగ్గురికి వడ్డించింది. రోజుకన్నా రెండు ముద్దలు ముగ్గురూ ఎక్కువగానే తిన్నారు. తిన్నాక అంతమ్మ వెచ్చగా వుంటుందని పొయ్యి దగ్గరే పడుకుంది. పార్వతి, నాగమల్లయ్య ఎదురింటి నానుకుని వున్న 'అర్ర'లో పడుకున్నారు. ఉన్న ఒక్క 'మెత్త'మీద ఆలుమొగలు తలలుపెట్టి పడుకున్నారు.

నాగమల్లయ్య తన పటేలు ఇంటి గురించి చెపుతూ, పటేలు బిడ్డ అరుంధతమ్మ కనడానికి వచ్చిందని, ఇప్పుడు ఏడో నెలనే అయినప్పటికీ రేపు పట్నం బండిలో తీసుకుపోతున్నారని చెప్పాడు. పార్వతి కళ్ళముందు అరుంధతమ్మ ఆకారం కదిలింది. పాప్పడి పండులా వుండే అరుంధతమ్మ కట్టే చీరలంటే తనకెంతో ఇష్టం...

....................

కోడి కూసింది. చెట్టుమీద పక్షులు సగం నిద్రలోనే కదులుతూ వున్నాయి. ఒకటి రెండు పక్షులు రెక్కలు టపటపలాడిస్తూ కొమ్మలను మార్చుకుంటున్నాయి. దూరంలో ఎవరో ముసలాయన దగ్గుతున్న శబ్దం. అక్కడెక్కడో కుక్క మొరుగుతున్న చప్పుడు. తల్లి పక్కలో మూత్రం పోసుకుని ఏడుస్తున్న పసిపాప గొంతు... పట్నంలో కొలువుకు పోతున్న కరణం పంతులు కొడుకు సైకిల్ గంట చప్పుడు... ఊరావల నుంచి వినిపిస్తోన్న బాలసంత పదం... ఊరావల నక్కల ఊళ... కాపువాడలో నీళ్ళు చేదుతున్న చప్పుడు... కోమటి అంజయ్య ఇంటి తలుపుకు అడ్డు పెట్టి వున్న ఇనుప 'కుందెన' తీసిన చప్పుడు... జీతగాణ్ణి లేపడానికి వచ్చిన నారాయణ పటేలు పిలుపు... క్రమంగా పిట్టల, కాకుల చప్పుడు ఎక్కువవుతోంది. మెల్లిగా ఊరు మేలుకుంటోంది. దూడల, లేగల అరుపులు వినిపిస్తూ వున్నాయి.

అంతమ్మ పొయ్యి దగ్గర్నుంచి లేవలేదు. చలి జ్వర మొచ్చినట్టుగా వుంది. శరీరమంతా వణుకుతోంది. నిండుగా బొంత కప్పుకుని ముదురుకుంది. మనసులో లేవాలని వున్నా లేవడానికి ఓపిక లేదు. శరీరమంతా సూదుల్తో పొడుస్తున్నట్టుగా వుంది. తలను రాయితో గుద్దినట్టుగా వుంది. కళ్ళు ఆవిరావిరిగా వున్నాయి. నాలుక మొద్దుబారినట్టుగా వుంది. కడుపు నిండుగా వుంది. కాళ్ళు, చేతులు కదపడం కూడా ఇష్టమనిపించడం లేదు.

పక్కలోకొచ్చి పడుకున్న కుక్కపిల్లను మాత్రం వెలగొట్టి అలాగే పడుకుంది అంతమ్మ.

అత్త అలికిడి వినిపించడం లేదని పార్వతి పక్కలోంచి లేచింది. భర్త నాగమల్లయ్య అంతకుముందే చెంబు పట్టుకుని బయటకెళ్ళాడు.

పార్వతి తల వెంట్రుకలను విప్పి ఓసారి దులుపుకుని, ముడి వేసుకుంటూ మెల్లిగా పొయ్యింట్లోకి అత్త దగ్గరికి వచ్చింది.

అంతమ్మ కాళ్ళ దగ్గర పడుకున్న కుక్కపిల్ల పార్వతిని చూసి పారిపోయింది.తల నిండుగా కప్పుకున్న బొంతను కొంత తీసి, పార్వతి ''అత్తా...'' అని పిలిచింది.

అంతమ్మ వణుకుతున్న గొంతుతో

''ఊ..'' అని బొంత మరింత నిండుగా కప్పుకుంటూ ''నాకు చాతనైతలేదే! సలిజ్వరమొచ్చినట్టుగుంది. పక్కలకేలి లేవ చాతనైతలేదు. నిన్న ఆ బురదల మర్లాడిన నా రెక్కలన్ని పచ్చి పుండ్లయినయ్... నా కాళ్ళు, రెక్కలు కదలనిస్తలేవు. మెల్ల మెల్లగా నువ్వే పని చేసుకో...'' అంది.

పార్వతి శింగులను మీదకు చెక్కుకుంటూ

''అట్లయితే అట్లనే కానియ్, కాని, ఎదురింట్లకు పోయి పండుకో!'' అంది. ఆ మాటలో పొయ్యి వద్ద ఊడ్చి, శుభ్రం చేయాలన్న భావన ధ్వనించింది.

అంతమ్మ బలవంతంగా కోడలి సాయంతో లేచి, ఎదురింట్లోకెళ్ళి రోటి పక్కన చాపేసుకుని పడుకుంది.

చెంబుతో బయటకెళ్ళిన నాగమల్లయ్య తిరిగివచ్చి, పగ్గాలు తీసుకుని తన పటేలు పొలంలో బురద నాగలి కట్టడానికి బయలుదేరాడు.

పార్వతి వాకిలి ఊడ్చింది. కొళ్ళాసు వదిలింది.

అప్పటికే పూర్తిగా తెలవారింది.

రాత్రి వండిన కుండలను, తోమాల్సిన గిన్నెలను, గ్లాసులను దడి దగ్గర వేసింది. కడగడానికి గోళెంలో నీళ్ళు లేవు. ఇంట్లో కూడా నీళ్ళు ఎక్కువగా లేవు. అక్కడే వున్న రెండు బిందెల నీళ్ళుపట్టే కడవను తీసుకుని, చేతాడు తీసుకుని నీళ్ళబావికి బయలుదేరింది పార్వతి.

ఓ జీతగాడు వడ్లాయన ఇంటి నుంచి వాగిలి తీసుకుని పోతూ వున్నాడు. గిర్నీ నుంచి పిండి తీసుకొస్తున్న పిల్లలు ఇద్దరు ఎదురైయ్యారు. చిన్న గుల్లతో కోమటి దుకాణానికి ఓ స్త్రీ పోతూ వుంది. ఒకరిద్దరు అరుగులపై కూర్చుని మొఖాలు కడుక్కుంటూ వున్నారు. పశువులు ఊరావలకు పోతూ వున్నాయి. ఎత్తయిన బండికి మంచి ఎడ్లను కట్టి, పగ్గాలు పట్టుకుని పటేలు జీతగాడు ముందు నడుస్తూ వున్నాడు. అందులో అరుంధతమ్మ కూర్చున్నది. బండినిండా పరుపులు వేసి వున్నాయి. పైన ఎండ తగలకుండా ఓ దుప్పటి కట్టి వుంది. పార్వతి నవ్వుతూ అరుంధతమ్మను చూసింది. ఆ ఎత్తయిన పొట్ట, పొప్పడి పండులాంటి ఆమె ముఖాన్ని మార్చి మార్చి చూసింది. అయితే అరుంధతమ్మ ఆలోచనలన్నీ ఆసుపత్రివైపే వున్నాయి. పార్వతిని కన్నెత్తి చూడలేదు. బండి బావి దాటి పోయింది.


బావి వద్ద ఒకరిద్దరు తప్ప ఎవరూ లేరు. త్వరగా పని తెమలాలని పార్వతి గబగబా చేతాడు బావిలోకేసి వేగంగా నీళ్ళు తోడింది... కడవ నిండింది. కడవ నిండే సరికి బావి వద్ద ఎవరూ కనిపించలేదు. దారిన ఎవరైన ఆడవాళ్ళు పోతున్నారేమోనని పరిశీలించింది. ఎవరూ కనిపించలేదు. ధైర్యం చేసి తానే కడవను ముందు మోకాళ్లపైకి ఎత్తుకుని ఆ తరువాత భుజంపైకి బలవంతంగా ఎత్తుకుంటూ వుండగా కడుపులో గునపంతో పెకిలించినట్టయింది. ఆ బాధను, నొప్పిని పెదవుల మధ్యనే అణచిపెట్టి ఇంటివైపు మెల్లిగా అడుగులేసింది.

దడి వద్ద కడవ దించేప్పుడు కూడా శక్తినంతా కూడదీసుకుని దించేసరికి ఆ నొప్పి మరింత ఎక్కువయింది. రెండు క్షణాలు అలాగే కూర్చుండిపోయి నొప్పి కొంత తగ్గిందనిపించగానే తనపని తాను చేసుకోసాగింది పార్వతి.

పని చేస్తున్నంతసేపూ పేగు జారుతున్నట్టనిపిస్తోంది. నొప్పి వుండనే వుంది. వంట పని అయిపోయాక పడుకుందామని నిర్ణయించుకుని, బలవంతంగా వంట పని చేయసాగింది పార్వతి.

క్రమంగా తన చీర పచ్చి అవసాగింది. తడి తడి అనిపించసాగింది. నొప్పి క్రమంగా అధికమవుతోంది. కదలకుండా వుంటే తగ్గుతుందేమోననుకుని పొయ్యి ముందు అలాగే కూర్చుండిపోయింది. పార్వతి... కొన్ని క్షణాలు తడి కావడం తగ్గినట్టనిపించినా తరువాత తిరిగి యథావిధిగానే అనిపించసాగింది.

ఎందుకో పార్వతికి భయమనిపించింది. మనసు పరిపరివిధాల పోతోంది. తల్లీ, తండ్రీ, అన్న, చెల్లె మనసులో మెదిలారు. అలాగే భర్త, అత్త గొంతు చప్పుడు




చెవుల్లో వినిపించసాగింది. మరెన్నో దృశ్యాలు మనసులో మెదులుతూ వున్నాయి... నొప్పి అధికమవు తోంది. ఒక్కో క్షణం భరించరానిదిగా వుంటోంది.

అత్తనులేపి విషయం చెపుదామని గోడను ఆసరా చేసుకుని పార్వతి మెల్లిగా లేచింది. కాళ్ళు చేతులు భయంతో వణుకుతూ వున్నాయి. చీర మరింత పచ్చిగవుతోంది. కాళ్ళ వెంట ఉమ్మనీరు చుక్కలు చుక్కలుగా నేలపై పడుతున్నాయి. అడుగులో అడుగేసుకుంటూ ఎదురింటి గడప దాటడానికి పార్వతికి ఐదు నిమిషాలు పట్టింది. ఓ చేయి నడుము వద్ద పెట్టుకుని, మరో చేయి గోడను పట్టుకుంది. తన పొత్తి కడుపులోని నొప్పి, బాధను పంటి కింద పట్టుకుని కళ్ళు చిట్లిస్తూ మరో అడుగు ముందుకేసింది.

ఇక ఆ నొప్పి భరించడం చేతగాక, తన నరాలను తన స్వాధీనంలో వుంచుకోవడం వీలుగాక, ఉమ్మనీరు పోవడాన్ని అదుపు చేసుకోలేక, కడుపులోని శక్తినంతా కూడదీసుకుని ఏమీ చేయలేక కేక వేసింది. అసహనంగా ఆర్తనాదం చేసింది.

ఆ కేకకు అంతమ్మ జ్వరం సగం పారిపోయింది.




కళ్ళు తెరచి, గోడకు బల్లిలా కరచుకుని నిల్చున్న కోడలిని చూసేసరికి మిగతా జ్వరం తనకు తెలియకుండానే పారిపోయింది.

పార్వతి మొఖం నిండా చెమటలు... స్నానం చేసినట్టుగా వుంది. కనుపాపలు మరీ తెలుపైయ్యాయి. కనుగుడ్లు లోపలికి పోయాయి. ముక్కు పుటలు అదురుతూ వున్నాయి. పిడికిళ్ళు గట్టిగా బిగుసుకున్నాయి. చీర కుచ్చిళ్ళ వద్ద ఓ మాంసం ముద్ద కనిపించింది.

అంతమ్మ అబోదిబో మంటూ గుండెలు గుద్దుకుంది. గబుక్కున లేచి కోడలును తన చేతుల్లోకి తీసుకుని ఏడుస్తూనే మెల్లిగా కూర్చోబెట్టింది.

విషయం పూర్తిగా అర్థమయ్యేసరికి అంతమ్మ తలపై ఇంటి కప్పు కూలినట్టయింది. సగం ఎక్కిన నిచ్చెనను ఎవరో కసిగా తోసేసినట్టనిపించింది. పూవు పూసి, కాయ కాసి, పండవుతుందనుకున్న ఫలం ఎవరో కాలితో నేలరాసినట్టనిపించి పొరలి పొరలి ఏడ్వసాగింది.

అప్పటికే పార్వతి స్పృహ కోల్పోయింది.

అంతమ్మ ఏడుపు విని చుట్టుపక్కల ఆడవాళ్ళు పరుగెత్తుకొచ్చారు. అక్కడి దృశ్యం చూసి కొంగులను నోటికడ్డు పెట్టుకుని మౌనంగా రోదించసాగారు. ఒకరిద్దరు అంతమ్మ పక్కన కూర్చుని ఓదార్చసాగారు. పార్వతిని సరిగ్గా పడుకోబెట్టారు.

నాగమల్లయ్యకు విషయం తెలియగానే బురద కాళ్ళతో పరుగెత్తుకొచ్చాడు. వస్తే ఏముంది? చిన్న నెత్తుటి మడుగులో పిండం. పిండంతో పాటు మాయ..

తల్లి కొడుకుని పట్టుకుని బోరున ఏడ్వసాగింది. అక్కడున్న ఆడవాళ్ళు కూడా గట్టిగా ఏడ్చారు ఆ దృశ్యాన్ని చూసి... నాగమల్లయ్య నరాలన్ని చల్లబడ్డాయి. ఏ ఆలోచనా రాక ఓ రెండు క్షణాలు అలాగే వుండిపోయి గొల్లున ఏడ్చాడు పసివాడిలా.

ఇరవై రెండేళ్ళ తరువాత ఓ పసికందు తన ఇంట్లో పుడుతుందనుకున్న నాగమల్లయ్యకు ఆ పిండం చూస్తూనే నవనాడులూ స్తంభించిపోయాయి. అందులోనూ ఆ పిండం మగబిడ్డది అని తెలిసేసరికి నాగమల్లయ్య గుండె చెరువయ్యింది.. అంతమ్మ మనసు ఆవిరైపోయింది.